



# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190






ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :135 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ మంగళవారం- 08 - సెప్టెంబర్ - 2026


## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు




ఈ నెలాఖరులోగా నియామకాలు పూర్తి చేయాలని ఆదేశం

ఇప్పటికే 1,294 పోస్టులను భర్తీ చేసినట్టు మంత్రి వెల్లడి

అర్హత: 10వ తరగతి, 25-45 ఏళ్ల వయసు, స్థానిక మహిళలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రకటించారు. ఈ నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నియామకాలను జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉండే జిల్లా ఆరోగ్య సొసైటీల ద్వారా చేపట్టనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. మిగతా..2లో

## చెన్నైలో మలేషియా విమానం అత్యవసర ల్యాండింగ్.. 186 మంది సురక్షితం..!




దాంతో.. అందులో ప్రయాణిస్తున్న 186 మంది, చెన్నై విమానాశ్రయ సిబ్బంది హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.

రెండో ఇంజిన్‌లో సమస్య ఏర్పడడంతో పైలట్లు వెంటనే చెన్నై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను అప్రమత్తం చేశారు.

ఢిల్లి : మలేషియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఒకటి చెన్నై లో అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఇంధనంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అప్రమత్తమైన పైలట్లు వెంటనే చెన్నై విమానాశ్రయాన్ని సంప్రదించి.. అనుమతి లభించగానే సురక్షితంగా ల్యాండ్ చేశారు. అదృష్టవశాతూ విమానం ఎలాంటి ప్రమాదానికి గురవ్వలేదు. దాంతో.. అందులో ప్రయాణిస్తున్న 186 మంది, చెన్నై విమానాశ్రయ సిబ్బంది హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. మలేషియా విమానయాన మిగతా..2లో

## అమరావతిపై నాకు అభ్యంతరం లేదు.. మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు




- ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సిందేనన్న విజయసాయి
- రెడ్డి, కమ్మ సామాజికవర్గాల వారే సీఎంలుగా ఉండాలా అని ప్రశ్న
- తమ పార్టీలో 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తానని వెల్లడి

అమరావతి : "అమరావతిని రాజధానిగా ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు.. మనకు ఇష్టమున్నా లేకున్నా అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించి తీరాల్సిందే" అని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త రాజకీయ పార్టీ

## వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం..
## ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి: సీఎం చంద్రబాబు

- రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించి తెలుగు తల్లికి జలహారతి పడతామన్న సీఎం
- 'వాటర్ మ్యాన్'గా ఎకనామిక్ టైమ్స్ కథనంపై హర్షం
- సీఎంకు నేతల స్టాండింగ్ ఒవేషన్
- వైసీపీ ఫేక్ ప్రచారాన్ని ఫ్యాక్ట్‌తో తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- కష్టకాలంలో అండగా నిలిచిన కార్యకర్తలకు సముచిత గౌరవమని హామీ
- టీడీపీ లీడర్‌షిప్ కాన్‌క్లేవ్.. పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి : రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందించి తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సాగునీటి రంగంపై తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రతిష్టాత్మక 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందని అన్నారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సాగునీటి రంగంపై చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అభినందన తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీతో యువతకు ఉపాధి కల్పించిన మిగతా..2లో

## ఢిల్లీలో మంత్రి నాదెండ్ల బిజీబిజీ..
## నిత్యావసర ధరలపై కీలక చర్చలు



- ఢిల్లీ పర్యటనలో ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ బిజీబిజీగా ఉన్నారు.
- ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్(వీణ)ని మంత్రి కలిశారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7: ఢిల్లీ పర్యటనలో ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ని(వీణ) మంత్రి కలిశారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల సరఫరా తీరు, మిగతా..2లో

## మోదీ సభ కోసం తొలిసారి 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్
### వెయిటింగ్ లిస్ట్‌లో 42,000 మంది!

- మంగళవారం గుజరాత్‌లో పర్యటించనున్న నరేంద్ర మోదీ
- పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్న ప్రధాని
- ఈ కార్యక్రమం కోసం 'బుక్ మైషో'లో ఫ్రీగా రిజిస్ట్రేషన్



ఢిల్లి: భారత ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 8న గుజరాత్‌లోని వడోదరలో పాల్గొననున్న కార్యక్రమానికి ప్రజల నుంచి ముందుగానే విశేష స్పందన వచ్చింది. తొలిసారిగా ప్రధాని కార్యక్రమానికి 'బుక్ మైషో' ద్వారా ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రారంభమైన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆ తర్వాత కూడా మిగతా..2లో

## రూ.1.10 లక్షల కోట్లతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లు

కీలక ప్రతిపాదనలకు రక్షణ శాఖ పచ్చజెండా



- రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర
- ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు

ఢిల్లి : దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. మిగతా..2లో

## ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది
## ద్రవ్యోల్బణం పండుగల ఆనందాన్ని దెబ్బతీస్తోంది

- మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోందని జైరాం రమేశ్ ఫైర్
- "ద్రవ్యోల్బణం 'హై వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది.



ఢిల్లి : నిత్యావసరాల ధరల పెరుగుదల వేళ కేంద్రంలోని మోదీ సర్కార్ పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ద్రవ్యోల్బణం 'హై-వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని విమర్శించింది. ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉందని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు. పండుగ షాపింగ్ సీజన్ ప్రారంభం కాకముందే పెరుగుతున్న ధరలు గృహ బడ్జెట్లపై భారం మోపాయని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను ఆయన ఎక్స్ లో షేర్ చేశారు. "ద్రవ్యోల్బణం 'హై వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోంది. కేవలం మూడు వారాల్లోనే ఉల్లిపాయల ధరలు రెట్టింపు అయ్యాయి. చక్కెర ధర 25 శాతం పెరిగింది. కందిపప్పు, మినుములు, ఆవాలు, రిఫైన్ డ్ ఆయిల్ ధరలు కూడా పెరిగాయి. దీపావళికి ముందే బాదం, జీడిపప్పు, మిగతా..2లో

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు




- అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్స్ స్వీకరణ
- సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని అంగీకరించిన ఎన్నికల సంఘం
- నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల

హైదరాబాద్ : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది.

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలని అసెంబ్లీలో
# సీఎం రేవంత్ డిమాండ్

- తాతా మధు వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం
- ఎమ్మెల్సీని డిస్మిస్ చేయాలని మండలి చైర్మన్ ను కోరిన వైనం
- స్పీకర్‌ను గౌరవించడం సభా సంప్రదాయమని వ్యాఖ్య
- బీఆర్ఎస్ నేతలపై సీఎం తీవ్ర ఆరోపణలు




హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తాతా మధును తక్షణమే చట్టసభ నుంచి డిస్మిస్ చేయాలని శాసనమండలి ఛైర్మన్‌ను కోరారు. ఈ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభలో సోమవారం మాట్లాడిన రేవంత్ రెడ్డి.. సభాపతి స్థానానికి ఎంతో గౌరవం ఉందన్నారు. స్పీకర్‌ను గౌరవించడం చట్టసభల కనీస సంప్రదాయమని చెప్పారు. మిగతా..2లో

## శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్



- తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడలేదని వెల్లడి
- ఈ దాడి వెనుక రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపణ
- దీనిపై శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హైదరాబాద్: ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు అసెంబ్లీకి వెళ్లిన ప్రతిపక్ష సభ్యులపై పోలీసులు అత్యంత కిరాతకంగా వ్యవహరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి 1000 రోజులుగా పాలన సాగిస్తోందని, దీనిపై శాంతి యుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తే తమపై ఉక్కుపాదం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## ఢిల్లీలో మంత్రి నాదెండ్ల బిజీబిజీ..

# నిత్యావసర ధరలపై కీలక చర్చలు

ధరల నియంత్రణ, వినియోగదారులకు ఇబ్బంది లేకుండా సరుకులు అందుబాటులో ఉండేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజలందరికీ నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. అనంతరం, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేని నాదెండ్ల మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై ఢిల్లీ ఏపీ భవన్‌లో సివిల్ సప్లై శాఖ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ స్టోర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏబీఎన్‌తో నాదెండ్ల మాట్లాడుతూ.. ఢిల్లీలో తెలుగువారి కోసం నాణ్యమైన రైస్ అందించేందుకు స్టోర్‌ను ప్రారంభించామని తెలిపారు. రేపు కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి పామ్ ఆయిల్, ఉల్లిపాయలు, పప్పు ధరలపై చర్చిస్తామని చెప్పారు. సివిల్ సప్లై శాఖలో అవినీతి జరగకుండా చర్యలు చేపట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## అమరావతిపై నాకు అభ్యంతరం లేదు..

## మా పార్టీ సీఎం అభ్యర్థి నేను కాదు: విజయసాయిరెడ్డి

ఏర్పాటు చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించిన ఆయన... భవిష్యత్ కార్యాచరణపై మీడియాతో మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని.. ఏపీని రూ. 12 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకే తమ కొత్త పార్టీ ఉద్భవిస్తోందని స్పష్టం చేశారు. కేవలం రెడ్డి, కమ్మ సామాజిక వర్గాల వారే సీఎం స్థానంలో ఉండాలా? ఆయన ప్రశ్నించారు. బీసీలతో సహా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తామని... తమ పార్టీలో ఏకంగా 66 శాతం ప్రాధాన్యత యువతకే ఇస్తామని హామీ ఇచ్చారు. ఇదే సమయంలో ఆయన మరొక సంచలన ప్రకటన చేశారు. తన పార్టీకి తాను సీఎం అభ్యర్థిని కాదని స్పష్టం చేశారు. బాల్ థాకరే తరహాలో కేవలం 'మెంటర్' గా మాత్రమే దిశానిర్దేశం చేస్తానని తేల్చిచెప్పారు. తన కుటుంబ సభ్యులు ఎవరూ కూడా పదవుల్లో ఉండరని స్పష్టం చేశారు. రాష్ట్రం విడిపోయినప్పుడు రూ. 1.02 లక్షల కోట్లుగా ఉన్న అప్పులు, గత 12 ఏళ్ల పాలనలో రూ. 12 లక్షల కోట్లకు ఎలా చేరాయని... ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి అద్దెలను అదుపులోకి తీసుకురావడమే తమ పార్టీ ప్రధాన ధ్యేయమని వెల్లడించారు.

## కేసీఆర్ క్షమాపణ చెప్పాలని

# అసెంబ్లీలో సీఎం రేవంత్ డిమాండ్

సభాపతిపై అభ్యంతరకరమైన భాషను ఉపయోగిస్తే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇది స్పీకర్‌కు జరిగిన అవమానం మాత్రమే కాదని, సభలోని ప్రజాప్రతినిధులందరికీ జరిగిన అవమానమని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులను కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు పిలిపించి ఉసిగొల్పి పంపడం వల్లే ఆ పార్టీ నేతలు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సభ్యుల హక్కులను కాపాడుతున్న స్పీకర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం కొన్ని సందర్భాల్లో సంయమనం పాటిస్తుందని, దాన్ని తమ చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నో సభలను చూశానని, చట్టసభల్లో ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదని రేవంత్ అన్నారు. ఇలాంటి వైఖరిని క్షమిస్తూ పోతే ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలకు ఉన్న గౌరవం దెబ్బతింటుందని హెచ్చరించారు. మరోవైపు బీజేపీపైనా సీఎం విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలను కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో నిర్ణయం తీసుకున్న తర్వాతే బీజేపీ లేవనెత్తిన అంశాలపై చర్చిస్తామని రేవంత్ స్పష్టం చేశారు.

## శాంతియుతంగా నిరసన తెలిపేందుకు

# వెళితే ఉక్కుపాదం మోపారన్న కేటీఆర్

నిరసన తెలిపినట్లే తాము కూడా నిరసన తెలిపేందుకు యత్నించామని, తాము ఎలాంటి అన్‌పార్లమెంటరీ, నికృష్టమైన భాష మాట్లాడలేదని స్పష్టం చేశారు. గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రులుగా, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన అత్యంత అనుభవజ్ఞురాళ్లు, సౌమ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు దారుణం అంటూ కేటీఆర్ తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు రాహుల్ గాంధీ ఢిల్లీలో 'స్మాష్ ది పాట్రియార్కీ' అంటూ మహిళా సాధికారతపై గొప్పలు చెప్తారు. కానీ ఇక్కడ రాహుల్ గాంధీ రాజకీయాల్లోకి రాకముందే మంత్రులుగా పనిచేసిన సీనియర్ మహిళా నేతల జుట్టు పట్టుకుని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు" అని నిలదీశారు. పోలీసులు సునీతా లక్ష్మారెడ్డి చీర పట్టుకుని లాగుతుంటే... కోవ లక్ష్మి అడ్డుకోకపోయి ఉంటే తీవ్ర ప్రమాదం జరిగి ఉండేదని, ఈ ఘటనతో సునీతమ్మ కంటనీరు పెట్టుకోవడం చూస్తే ఇది శాసనసభలా కాకుండా దుశ్శాసన సభలా మారిందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీనియర్ నాయకురాళ్ల పట్ల జరిగిన ఈ దాడి, అనాగరిక ప్రవర్తన వెనుక స్పష్టంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందే తప్ప మరొకటి కాదని కేటీఆర్ ఆరోపించారు.

## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు మరోసారి పొడిగింపు

అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా రిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## ఏపీలో పదో తరగతి అర్హతతో 913 ఉద్యోగాలు

అలాగే, దరఖాస్తుదారుల వయసు 25 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండటం తప్పనిసరి. సంబంధిత గ్రామాలు లేదా వార్డులకు చెందిన స్థానిక మహిళలకు ఈ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించనున్నారు. ఎంపికైన ఆశా కార్యకర్తలకు నెలకు రూ.10,000 చొప్పున గౌరవ వేతనం లభిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటికే 1,294 ఆశా కార్యకర్తల పోస్టులను భర్తీ చేశామని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తాజాగా మరో 913 పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపామని, వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేసి క్షేత్రస్థాయిలో వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని ఆయన వివరించారు. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

## మోదీ సభ కోసం తొలిసారి

## 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్- గంటలోనే సీట్లన్నీ ఫుల్

భారీ సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నించడంతో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. ఈ సీట్ల బుకింగ్ తీరు మోదీ కార్యక్రమం పట్ల ప్రజలకు ఉన్న అపారమైన ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది. నరేంద్ర మోదీ మంగళవారం వడోదరలో పర్యటించనున్నారు. నగరంలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇంకొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ ప్రోగ్రామ్ సీట్ల రిజిస్ట్రేషన్ కోసం తొలిసారి వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) బుక్ మైషోను ఉపయోగించింది. దీంతో ప్రధాని సభకు భారీగా స్పందన రావడం గమనార్హం.

## చెన్నైలో మలేషియా విమానం

## అత్యవసర ల్యాండింగ్.. 186 మంది సురక్షితం..!



సంస్థకు చెందిన విమానం సోమవారం అత్యవసరంగా చెన్నైలో ల్యాండ్ అయింది. 186 మంది ప్రయాణికులతో కౌలాలంపూర్ నుంచి చెన్నైకి బయల్దేరిన ఎంహెచ్156 గాల్లో ఉండగానే ఇంజిన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. రెండో ఇంజిన్‌లో సమస్య ఏర్పడడంతో పైలట్లు వెంటనే చెన్నై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను అప్రమత్తం చేశారు. సురక్షితంగా ల్యాండింగ్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దాంతో, చెన్నై విమానాశ్రయ అధికారులు హుటాహుటిన ఎమర్జెన్సీ సర్వీసులైన.. అంబులెన్స్, ఫైరింజన్లు, సీఐఎస్ఎఫ్ బృందాలను పిలిపించారు. అయితే.. పైలట్లు విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం 186 మంది ప్రయాణికులను, వారి లగేజీని దింపేశారు. ఇంధనంలో లోపం తలెత్తడానికి కారణాలను తెలుసుకునేందుకు ఢిల్లీ, చెన్నై విమానయాన అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వారంలోనే ఇండిగో విమానాన్ని కూడా ఇలా అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. సెప్టెంబర్ 1వ తేదీన గోవా నుంచి ఢిల్లీకి బయల్దేరిన 6ఈ 2102 విమానం గాల్లో ఉండగానే ఇంధనంలో సమస్య ఏర్పడింది. ఫ్లైట్ గాల్లోకి ఎగిరిన పదిహేను నిమిషాల్లోనే ఈ సమస్య తలెత్తడంతో పైలట్లు.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి సురక్షితంగా ల్యాండ్ చేశారు.

# వైసీపీది ఉగ్రవాదుల తరహా రాజకీయం.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి: సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

చంద్రబాబు, ఇప్పుడు జల సంరక్షణతో 'వాటర్ మ్యాన్'గా మారారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి సీఎం బాటలు వేస్తున్నారని ఎకనామిక్ టైమ్స్ కథనాన్ని ఆయన ఉటంకించారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఆ పత్రిక ప్రశంసించిందని తెలిపారు. ఈ ప్రశంసల నేపథ్యంలో పార్టీ నేతలంతా ఏకతాటిపై నిలబడి చంద్రబాబుకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

### కార్యకర్తలే పార్టీకి బలం.. కూటమి ఐక్యత ముఖ్యం

పొలిటికల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ పాలనలో ముందుకు సాగుతున్నామని చంద్రబాబు తెలిపారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు పూర్తి గౌరవం ఇస్తామని, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి పదవి ఇవ్వడమే దీనికి నిదర్శనమని అన్నారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికే పార్టీలో, చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. "పార్టీ బలోపేతం ఎంత ముఖ్యమో, కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యం. ఫ్లెక్సీలు, ఫోటోల



కోసం వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా పనిచేయాలి. 2024 కంటే 2029లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి," అని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

### గత పాలనపై విమర్శలు.. ఫ్యాక్ట్‌తో కౌంటర్ ఇవ్వండి

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టి, వ్యవస్థలను విధ్వంసం చేసిందని చంద్రబాబు విమర్శించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలనే ఒక కేస్ స్టడీ అని వ్యాఖ్యానించారు. "వైసీపీ ఒక గొడ్డలి పార్టీ. ఉగ్రవాదుల తరహాలో హిట్-రన్-హైడ్ అనే విధానంతో రాజకీయాలు చేస్తోంది. వారి ఫేక్ ప్రచారాన్ని తేలిగ్గా తీసుకోవద్దు. ప్రతి ఆరోపణను వాస్తవాలతో (ఫ్యాక్ట్) గట్టిగా తిప్పికొట్టాలి. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని నేతలకు దిశానిర్దేశం చేశారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ విషయంలో వైసీపీ వక్రీకరణలకు పాల్పడుతోందని, వాటిని ఎండగట్టాలని సూచించారు.

### అభివృద్ధి, సంక్షేమంలో దూకుడు

కేంద్ర సహకారంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని చంద్రబాబు వివరించారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టామని, మూడు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, రాయలసీమలో పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటుతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని వివరించారు. రాజముద్ర, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో భూములకు భద్రత కల్పిస్తూ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు.

# ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది- ద్రవ్యోల్బణం పండుగల ఆనందాన్ని దెబ్బతీస్తోంది

మొదటి పేజి తరువాయి

పిస్తా, ఎండుద్రాక్ష, వాల్‌నట్‌లు కూడా ఖరీదయ్యాయి. పాలు, చక్కెర ధరలు పెరగడంతో స్వీట్ల ధరలు కూడా నిరంతరం పెరుగుతున్నాయి. నెయ్యి, మసాలాల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వంటగది, పండుగలు ఖరీదైనవిగా మారాయి. గృహ బడ్జెట్ ఇబ్బందుల్లో పడింది. ప్రజల జేబులపై పడుతున్న ఈ భారం మోదీ ప్రభుత్వానికి కనిపించడం లేదు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకుండా, ప్రభుత్వం గణాంకాల గారడీతో దాని ప్రభావాన్ని దాచడంలో నిమగ్నమైంది. మోదీ గణాంకాల గారడీ ద్రవ్యోల్బణం ప్రభావాన్ని దాచలేరు. ప్రజలు ప్రతీదీ గమనిస్తున్నారు."

### జైరాం రమేశ్, కాంగ్రెస్ ఎంపీ

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి "హై వోల్టేజ్ షాక్" ఇస్తోందని కేంద్రంపై కాంగ్రెస్ ఇప్పటికే తీవ్ర విమర్శలు గుప్పించింది. అలాగే "అహంకారపూరిత" మోదీ ప్రభుత్వం "గణాంకాల గారడీ"తో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తోందని పేర్కొంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో నమోదైన 7.8 శాతం జీడీపీ వృద్ధి రేటు "ఆర్థిక పునరుజ్జీవనానికి సంకేతం" కాదని ఆ పార్టీ తెలిపింది.

### పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా జాప్యంపై కాంగ్రెస్ ఫైర్

మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా వేయడంలో జాప్యంపై కాంగ్రెస్ సోమవారం ప్రశ్నించింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదించడానికే హోం మంత్రి అమిత్ షా సభలను వాయిదా వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేసి నేటికి సరిగ్గా 25 రోజులు అయ్యింది. కానీ దానిని ఇంకా ప్రొరోగ్ చేయలేదు. సాధారణంగా నిరవధిక వాయిదా వేసిన 3-4 రోజుల తర్వాత ప్రొరోగేషన్ జరుగుతుంది. కానీ 2015 వర్షాకాల సమావేశాల్లో ఇది 28 రోజుల వ్యవధి ఉంది. లలిత్ మోదీ అంశంపై ఆందోళనలతో ఆ సమావేశాలు దాదాపు పూర్తిగా రద్దయ్యాయి. కానీ మోదీ ప్రభుత్వం జీఎస్టీ బిల్లులను బలవంతంగా ఆమోదింపజేయాలనే ఆశతో సమావేశాలను కొనసాగించింది. దానికి రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం, కానీ అది



వారికి లేదు. చివరికి, మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలతో మరింత అర్థవంతంగా సంప్రదించి చాలా ఆలస్యంగా బిల్లులను ఆమోదించాల్సి వచ్చింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదం కోసం హోం మంత్రి ఇప్పటికీ లోక్‌సభలో తనకు ఇష్టమైన మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం నానా తంటాలు పడుతుండటంతో 2026 వర్షాకాల సమావేశాలు వెంటిలేటర్‌పై ఉన్నాయి. ఆయన బెదిరింపులు, భయపెట్టే రాజకీయాలు హద్దులు దాటాయన్న వాస్తవాన్ని అంగీకరించడానికి ఇంకెంత కాలం పడుతుంది?" అని జైరాం రమేశ్ అన్నారు.

# రూ.1.10 లక్షల కోట్లతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లు- కీలక ప్రతిపాదనలకు రక్షణ శాఖ పచ్చజెండా

మొదటి పేజి తరువాయి

ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.

### రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర

సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి



కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది.

### అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం

డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

# ఈనెల 12 వరకు అసెంబ్లీ సమావేశాలు - బీఏసీ భేటీలో నిర్ణయం

**శాసనసభ, మండలి నిర్వహణపై**

**ముగిసిన బీఏసీ సమావేశాలు**

**ఈనెల 12 దాకా శాసనసభ, వారం దాకా**

**మండలి సమావేశాల నిర్వహణకు ఆమోదం**

**22ఏ, ఫీజు రియంబర్స్ మెంట్ పై చర్చలు**

**జరపాలని విపక్షాల డిమాండ్**

**ఈనెల 12 దాకా శాసనసభ నిర్వహించాలని**

**బీఏసీ సమావేశంలో నిర్ణయం**

ఢిల్లి : శాసనసభ, మండలి సమావేశాల నిర్వహణపై జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉభయ సభలను ఈనెల 12 వరకు నిర్వహించాలని బీఏసీలో ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి సమీక్ష జరపాలని నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన ఇవాళ జరిగిన శాసనసభ బీఏసీ సమావేశంలో ప్రధానంగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా రూపొందించారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఉదయం శాసనసభకు వెళ్తున్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అసెంబ్లీ బీఏసీ సమావేశంలో 22ఏ, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దీంతో పాటు మరో 22 కీలకమైన అంశాలపై చర్చ జరిపేందుకు కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీలో సమావేశాలు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నిరోజులు సభ నిర్వహించినా సిద్ధమే : ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు మైనారిటీ అంశాలపైనా అసెంబ్లీలో చర్చలు జరపాలని ఎంఐఎం నేత బలాలా సైతం కోరారు. ఈ నేపథ్యంలో సభలో ఎన్నిరోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కాగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్.. రాష్ట్రంలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, అసెంబ్లీని కనీసం 20



నుంచి 30 రోజుల పాటు నడపాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. వారంపాటు మండలి సమావేశాలు : మరోవైపు శాసనమండలి సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించినట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. సభ్యుల కోరిక మేరకు అవసరమైతే మరిన్ని రోజులు పొడగిస్తామని ఆయన పేర్కొన్నారు. సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన తన ఛాంబర్ లో మండలి బీఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, ఎఫ్ఎండీ, శ్రీపాల్ రెడ్డి, శాసన మండలి సెక్రెటరీ డా.నరసింహా చార్యులు పాల్గొన్నారు.

# పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనిపించింది

**బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు - బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం - తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించడం లేదని ప్రశ్న**

హైదరాబాద్ : బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య వాగ్వాదంపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఎన్నడు ఇలాంటి ఘటనలు జరగలేదన్న మంత్రి శ్రీధర్ బాబు, పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించిందని తెలిపారు. సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారని, ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారని ఆరోపించారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించిందని, పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనబడుతోందని వెల్లడించారు. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని తామెప్పుడూ అనుకోలేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది : బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉందన్న మంత్రి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించిందని, టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదని నిబంధన ఉందని గుర్తు చేశారు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్



సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయని మండిపడ్డారు. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. రాహుల్‌కు ఒక న్యాయం, మాకో న్యాయమా అంటూ కేటీఆర్ అంటున్నారని, రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకొని లోక్‌సభకు వెళ్లలేదని తెలిపారు. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే తాము తీసుకెళ్లలేదని గుర్తు చేశారు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారని, ఏవైనా లోటుపాట్లు జరిగితే ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఎందుకు ఖండించదు : స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదని హితవు పలికారు. తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందని, కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయని తెలిపారు. తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎందుకు ఖండించదని ప్రశ్నించారు. క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు : స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం మంత్రి మండిపడ్డారు. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంటుందని, తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారని, శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారని, మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదని తెలిపారు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపిందని విమర్శించారు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తి లేదని స్పషం చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. వారు స్పీకర్‌కు క్షమాపణ చెప్పాకే మిగతా కార్యకలాపాలు ఉంటాయని, తప్పు జరిగిందని ఒప్పుకునే మనస్సు ఉండాలని వెల్లడించారు. "ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న పోలీస్ కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడాన్ని మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయి చేసుకున్నట్లు కనపడింది. పోలీసులపై దాడి చేస్తే అధికారంలోకి వస్తామని మేము ఎప్పుడూ అనుకోలేదు. పోలీస్ సిబ్బందిని గొంతు పిసుకుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. వారి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడే ప్రసక్తే లేదు

# కాగజ్‌నగర్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



ఆసిఫాబాద్: కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 220 మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ, డీఆర్డీఏ ఏపీడీ బానోత్ దత్తా ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 46 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఒక జత యూనిఫాం అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 9,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరి విద్య, ఆరోగ్యం, వసతి, భోజనం, దుస్తుల అవసరాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. యూనిఫాంలు అందుకున్న విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు అరెస్టులతో విద్యార్థుల ఉద్యమాన్ని అడ్డుకోలేరు

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: బీజేపీ



రెబ్బెన : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.15 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకోవడాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అణచివేస్తోందని ఆరోపించారు. ఈ క్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కుందారపు బాలకృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇగురపు సంజీవ్, బీజేవైఎం రెబ్బెన మండల ప్రధాన కార్యదర్శి బక్క ఆనంద్లను పోలీసులు తెల్లవారుజామున ముందస్తుగా అరెస్టు చేసి రెబ్బెన పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజ్ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రభుత్వ భయానికి నిదర్శనమని అన్నారు. ముందస్తు అరెస్టులతో తమ పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు పసుపులేటి మల్లేష్, సునాకర్ తిరుపతి, మండల కోశాధికారి మధుకర్, సీనియర్ నాయకులు రాచకొండ రాజన్న, జగన్నాథ ఓదెలు, ఇనగందుల రామయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

### కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రవీందర్



రెబ్బెన : దళిత సామాజిక వర్గానికి చెందిన శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రవీందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం రాజ్యాంగ వ్యవస్థను, దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, అవమానకర వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదన్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కేసీఆర్ సూచనలతోనే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ ఎదుట హంగామా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుండటాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ తదితర పథకాలను అమలు చేసిందన్నారు. తాతా మధు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అధిష్ఠానం వెంటనే స్పందించి ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని దుర్గం రవీందర్ స్పష్టం చేశారు.

# ప్రజావాణి ద్వారా మీ సమస్యలు పరిష్కరించుకోండి

### ఎంపీడీవో శ్రీపతి బాపూరావు




జైపూర్, : జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం రెండు ఫిర్యాదులు అందగా వాటిలో రెవెన్యూ శాఖకు (02) ఫిర్యాదులు వచ్చాయి. సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఎలాంటి సమస్యలైనా ఒకే చోట పరిష్కారం చేయాలన్న ఉద్దేశంతో ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, దీర్ఘకాలికంగా కూడా పరిష్కారం లభించని సమస్యలను అధికారుల సమన్వయంతో త్వరితగతిగా పరిష్కారాన్ని అందించే విధంగా చర్యలు చేపడుతున్నామని, జైపూర్ మండల ప్రజలందరూ ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో శ్రీపతి బాపు రావు, మండల డిప్యూటీ తహసీల్దార్ జే.సంతోష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సైదా, మెడికల్ ఆఫీసర్ జైపూర్ డాక్టర్ ముస్తఫా, ఎంపీహెచ్ఈఓ కుందారం టి.రాంబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఏ.వెంకటేష్, ఏఈ పిఆర్ బి.రాజ్ కుమార్, ఏఈ హౌసింగ్ కాంక్ష, ఏఈ ఆర్డబ్ల్యూఎస్ ఎన్.రాజమలయ్య, ఏఈ విద్యుత్తు జి.మనోహర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ గాయత్రి, ఏపీవో వీబీగ్రామ్ బి.బాలయ్య, ఏపీఎం ఐకెపి సిహెచ్ సంతోష్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రమేష్, మండల సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీసాయి లచ్చన్న, ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర రావు ,ఏఈఈ ఇరిగేషన్ డి.ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ



జైపూర్, : జైపూర్ మండలం వేలాల గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో ప్రభుత్వం ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్న ఏక రూప దుస్తులను సోమవారం హెచ్ఎం కే.శారద ఆధ్వర్యంలో సర్పంచ్ స్వప్న నగేష్, ఉప సర్పంచ్ రాజలింగు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..పాఠశాలలోని విద్యార్థులందరూ సమానమే అని తెలుపడం కోసమే ప్రభుత్వం ఈ ఏకరూప దుస్తులు పంపిణీ చేయడం జరుగుతుందని, పిల్లల్లో ఎలాంటి తారతమ్యాలు ఉండకూడదని, అందరూ అన్నదమ్ములగా, అక్కచెల్లెళ్లలాగా కలిసిమెలిసి ఐక్యమత్యంగా విద్య నేర్చుకుని, విజ్ఞానం సంపాదించుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, భవిష్యత్తులో బాగా చదివి గొప్ప స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకి, గురువులకి, సొంత ఊరికి గొప్ప పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేలాల పాఠశాల ఉపాధ్యాయులు, వార్డు మెంబర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు పొలంలోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ విత్తనం

వ్యవసాయం ఆగితే కేవలం పొలాలు మాత్రమే ఖాళీ కావు.. గ్రామాల్లో దుకాణాలు వెలవెలబోతాయి, యంత్రాలు నిలిచిపోతాయి, కూలీలకు పని తగ్గుతుంది, రవాణా మందగిస్తుంది, మార్కెట్లలో డబ్బు చలామణి తగ్గుతుంది. మనం తినే ప్రతి ముద్ద వెనుక ఒక రైతు శ్రమ ఉంటే.. ఆ రైతు చుట్టూ జీవించే అనేక కుటుంబాల బతుకు కూడా అదే వ్యవసాయంతో ముడిపడి ఉంటుంది. రైతు పొలంలో విత్తనం వేసిన క్షణం నుంచి ఒక పెద్ద ఆర్థిక చక్రం మొదలవుతుంది. ఆ చక్రం పంట చేతికి వచ్చే వరకు మాత్రమే కాదు.. పంట మార్కెట్ దాటి వినియోగదారుడి ఇంటికి చేరే వరకు కొనసాగుతుంది. అందుకే వ్యవసాయాన్ని కేవలం రైతు వృత్తిగా చూడటం అంటే దాని అసలు ప్రభావాన్ని చిన్నచూపు చూడటమే.

## విత్తనం నుంచి మొదలయ్యే జీవన చక్రం

ఒక రైతు పంట సాగు చేయాలని నిర్ణయించుకున్నప్పుడు ముందుగా విత్తనం అవసరం. తర్వాత ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు అవసరం. పొలాన్ని సిద్ధం చేసేందుకు ట్రాక్టర్ అవసరం. సాగునీటికి విద్యుత్, ఇంధనం అవసరం. పంట పనులకు కూలీలు అవసరం. ఇలా రైతు పొలంలోకి అడుగుపెట్టకముందే అనేక రంగాలకు పని మొదలవుతుంది. విత్తనాలు విక్రయించే వ్యాపారి, ఎరువుల దుకాణదారు, వ్యవసాయ పరికరాల వ్యాపారి, ట్రాక్టర్ యజమాని, డ్రైవర్, యంత్రాల నిర్వాహకులు.. ఇలా వ్యవసాయం చుట్టూ ఒక పెద్ద ఉపాధి వ్యవస్థ నడుస్తుంది. పంట సాగులో ప్రతి దశలో రైతు ఖర్చు చేసే డబ్బు మరో కుటుంబానికి ఆదాయంగా మారుతుంది. అదే డబ్బు మళ్లీ మార్కెట్‌లోకి వెళ్లి మరో వ్యాపారానికి ఊతమిస్తుంది. ఈ విధంగా రైతు పెట్టుబడి కేవలం పొలంలో పంటను మాత్రమే సృష్టించదు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో డబ్బు చలామణిని కూడా సృష్టిస్తుంది.

## రైతు పంటతో కదిలే ఉపాధి బండి




పంట పెరుగుతున్న కొద్దీ దాని చుట్టూ ఉపాధి పెరుగుతుంది. కలుపు తీయడం, మందులు పిచికారీ చేయడం, పంట సంరక్షణ, కోత, నూర్పిడి వంటి పనుల్లో వేలాది మంది ప్రత్యక్షంగా పనిచేస్తారు. వ్యవసాయ కూలీలకు పంట కాలం అంటే ఆదాయానికి ప్రధాన అవకాశం. కోత దశలో యంత్రాలకు డిమాండ్ పెరుగుతుంది. యంత్రాల యజమానులు, డ్రైవర్లు, మరమ్మతు కార్మికులు, ఇంధన విక్రేతలు కూడా వ్యవసాయంపైనే ఆధారపడతారు. పంటను పొలం నుంచి మార్కెట్‌కు తరలించేందుకు వాహనాలు అవసరం. అక్కడి నుంచి గోదాములు, మిల్లులు, కొనుగోలు కేంద్రాలు, వ్యాపార సంస్థల వరకు మరో ఉపాధి గొలుసు కొనసాగుతుంది. అంటే రైతు ఒక్కడే పొలంలో పనిచేస్తున్నట్లు కనిపించినా.. వాస్తవానికి అతని వెనుక ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక వృత్తులు పనిచేస్తుంటాయి.

## రైతు చేతికి వచ్చే డబ్బే గ్రామీణ మార్కెట్‌కు ఊపిరి

రైతుకు పంటకు సరైన ధర లభించినప్పుడు దాని ప్రభావం ఇంటి గడప దాటుతుంది. రైతు తన అవసరాల కోసం స్థానికంగా కొనుగోలు చేస్తాడు. వ్యవసాయ పెట్టుబడులు పెడతాడు. కుటుంబ అవసరాలు తీర్చుకుంటాడు. పిల్లల చదువు, ఇంటి మరమ్మతులు, దుస్తులు, గృహోపకరణాలు, వాహనాలు.. ఇలా అనేక రంగాల్లో ఖర్చు చేస్తాడు. ఈ ఖర్చులు స్థానిక వ్యాపారులకు ఆదాయంగా మారతాయి. వ్యాపారుల ఆదాయం మళ్లీ ఇతర రంగాలకు వెళ్తుంది. ఈ విధంగా రైతు చేతికి వచ్చే పంట ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చలామణికి ఇంధనంలా పనిచేస్తుంది. అదే రైతుకు పంట నష్టం వస్తే పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. రైతు కొనుగోళ్లు తగ్గిస్తాడు. వ్యవసాయ పెట్టుబడులు తగ్గుతాయి. కూలీలకు పనులు తగ్గుతాయి. స్థానిక దుకాణాల్లో అమ్మకాలు పడిపోతాయి. రవాణా నుంచి చిన్న వ్యాపారాల వరకు దాని ప్రభావం కనిపిస్తుంది. అందుకే రైతు ఆదాయం పెరగడం అంటే రైతు కుటుంబం మాత్రమే బలపడటం కాదు.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అనేక కుటుంబాల ఆదాయం పెరగడం.

## వ్యవసాయం బతికితేనే ఈ వ్యవస్థ బతుకుతుంది

అయితే వ్యవసాయం ముందు సవాళ్లు పెరుగుతున్నాయి. సాగు ఖర్చులు పెరగడం, కూలీల కొరత, వాతావరణ మార్పులు, నీటి సమస్యలు, పంటలకు గిట్టుబాటు ధరపై అనిశ్చితి, మార్కెట్ ఒడిదుడుకులు రైతు ఆదాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. రైతు ఒక్క పంట నష్టాన్ని భరించడం కాదు.. ఆ నష్టంతో వచ్చే అప్పులు, తదుపరి పంటకు అవసరమైన పెట్టుబడి, కుటుంబ ఖర్చులు అన్నీ అతని భుజాలపైనే పడుతున్నాయి. ఒకసారి రైతు సాగు నుంచి వెనక్కి తగ్గితే దాని ప్రభావం కేవలం పంట ఉత్పత్తిపై ఉండదు. వ్యవసాయంపై ఆధారపడిన మొత్తం ఉపాధి వ్యవస్థపై పడుతుంది. అందుకే వ్యవసాయాన్ని కాపాడేందుకు కేవలం పంట ఉత్పత్తి పెంచడమే సరిపోదు. రైతుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందడం, సాగు ఖర్చులు నియంత్రణలో ఉండటం, నీటి వనరుల రక్షణ, పంటకు సరైన ధర, మార్కెట్‌లో పారదర్శకత, నిల్వ సదుపాయాలు, రవాణా వంటి అంశాలన్నింటినీ ఒకే గొలుసుగా చూడాలి. ఎందుకంటే రైతు పొలంలో పంట పండితేనే మార్కెట్‌లో వ్యాపారం జరుగుతుంది. మార్కెట్ నడిస్తేనే అనేక కుటుంబాలకు ఉపాధి ఉంటుంది. ఆ ఉపాధి ఉంటేనే గ్రామీణ జీవితం చురుగ్గా ఉంటుంది. మనిషి బతకడానికి అన్నం కావాలి. అన్నం రావడానికి వ్యవసాయం కావాలి. వ్యవసాయం బతకాలంటే రైతు బతకాలి. రైతు బతికితేనే అతని చుట్టూ ఆధారపడి ఉన్న ఈ విస్తారమైన జీవన వ్యవస్థ బతుకుతుంది. బై ఒడ్నాల సందీప్

# అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్.) రాష్ట్ర 9వ మహాసభలపోస్టర్స్ లను లాల్ కుమార్ స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో చెన్నూర్ మండలం లో తెలంగాణ మోటార్ వర్కర్స్ యూనియన్ నుండి.ఆవిష్కరణ

చెన్నూర్ : తెలంగాణ మోటార్ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేయటం జరిగింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 8, 9 న జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐ కేఎంఎస్ స్టేట్ కమిటీ. జిల్లా కమిటీ. పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రమేష్ మాసాని ,ఐ ఎఫ్ టి యు నాయకులు ట్లాడుతూ....,, దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర కష్టాలతో ఎదుర్కొంటోందని అన్నారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, డీజిల్, పెట్రోల్, విద్యుత్ తదితర సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోయినా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కడం లేదన్నారు. కౌలు రైతులకు పోడు భూమి రైతులు.గుర్తింపు లేకపోవడం, రుణభారం పెరగడం, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతుండడం ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అన్నారు. వ్యవసాయ కూలీల పరిస్థితి కూడా అత్యంత దయనీయంగా మారిందని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం, కనీస వేతనాలు కూలీలకు అమలు కాకపోవడం వల్ల వ్యవసాయ కూలీలు జీవనోపాధి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయాలని, వ్యవసాయ కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి



కల్పించాలని, కనీస వేతనాలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికాతో సహా ఇతర దేశాలతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకుంటున్న విదేశీ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు భారత వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఒప్పందాల కారణంగా విదేశాల నుంచి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు పెరిగి దేశీయ రైతులు పండించిన పంటలకు మార్కెట్ దెబ్బతింటుందని, గిట్టుబాటు ధరలు మరింత తగ్గే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే ఇటువంటి వాణిజ్య విధానాలు రైతాంగ ప్రయోజనాలకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని దెబ్బతీసే అమెరికాతో సహా ఇతర దేశాలతో కుదుర్చుకున్న వ్యవసాయ సంబంధిత విదేశీ వాణిజ్య ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, దేశీయ వ్యవసాయాన్ని రక్షించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అవలంబించాలని డిమాండ్.....,,చేశారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో మంచిర్యాలలో జరగనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్.) రాష్ట్ర 9వ మహాసభలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించి, రైతు ఉద్యమాలను మరింత బలోపేతం చేసే కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. మహాసభల్లో రైతులకు గిట్టుబాటు ధరల సాధన, రైతుల రుణమాఫీ, కౌలు రైతుల హక్కులు, భూమిలేని పేదలకు భూమి పంపిణీ, వ్యవసాయ కూలీల సమస్యలు, ఉపాధి హామీ చట్టం పటిష్ట అమలు, సాగునీటి సమస్యలు, ప్రభుత్వాల రైతు-కూలీ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన ఉద్యమాలు, భవిష్యత్ రైతు-కూలీ పోరాటాల కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఏ ఐ కేఎంఎస్ జిల్లా నాయకులు స్టేట్ కమిటీ నాయకులు.లాల్ కుమార్, ఐ ఎఫ్ టి యు. డివిజన్ నాయకులు. రమేష్ మాసాని,, సుధాకర్ రెడ్డి, సాగర్, ఐ ఎఫ్ టి యు.డివిజన్ నాయకులు. దాగమా బోడంకిసాగర్, మమ్మద్ గయాసుద్దీన్, సయ్యద్ జాకీర్ హుస్సేన్, తదితరులు సాయిరాం పాల్గొన్నారు.

# అధికారంలో జోరు ఇప్పుడేల ఈ మౌనం..?

### రెండు జిల్లాల రాజకీయాల్లో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ తీరుపై చర్చ!
### కాంగ్రెస్‌లో చేరిన తర్వాత క్షేత్రస్థాయిలో తగ్గిన పర్యటనలు..
### పార్టీ కేడర్‌లోనూ, ప్రజల్లోనూ రకరకాల ఊహాగానాలు

మంచిర్యాల : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో, ముఖ్యంగా మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ ప్రస్తుతం రాజకీయంగా తీసుకుంటున్న వైఖరి ఉమ్మడి జిల్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా కొనసాగుతూ రెండు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన, కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న తర్వాత క్షేత్రస్థాయిలో అంతగా కనిపించకపోవడంపై కేడర్‌తో పాటు సామాన్య ప్రజల్లోనూ ఆసక్తికర చర్చ జరుగుతోంది.

## అప్పుడు నిత్యం ప్రజల్లోనే

గత ప్రభుత్వ హయాంలో పురాణం సతీష్ నియోజకవర్గాల వ్యాప్తంగా అత్యంత చురుగ్గా వ్యవహరించేవారు. అధికారిక కార్యక్రమాలు, పార్టీ వేదికలు, నియోజకవర్గాల్లో పర్యటనలు,



కార్యకర్తల కలయికలతో నిత్యం వార్తల్లో నిలిచేవారు. ఏ చిన్న సమస్య వచ్చినా స్పందించడం, కేడర్‌కు వెన్నుదన్నుగా నిలవడం ద్వారా రెండు జిల్లాల్లో తనదైన ముద్ర వేశారు.

## మార్పు తర్వాత మౌనమేల?

అయితే,రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, అనంతరం ఆయన బీఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరడం వేగంగా జరిగిపోయాయి. పార్టీ మారిన తొలినాళ్లలో ఆయన కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతారని, రెండు జిల్లాల్లో కాంగ్రెస్ బలోపేతానికి విస్తృతంగా పనిచేస్తారని భావించారు. కానీ, ఆశించిన స్థాయిలో ఆయన ప్రజాక్షేత్రంలో పర్యటించకపోవడం, పార్టీ ప్రధాన కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే వాదనలు వినిపిస్తుండటం కేడర్‌ను విస్మయానికి గురిచేస్తోంది. "అధికారంలో ఉన్నప్పుడు కనిపించినంత జోరు, ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఎందుకు కనిపించడం లేదు?" అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

## వ్యూహాత్మక మౌనమా? లేక అంతర్గత సమీకరణాలా?

పురాణం సతీష్ మౌనం వెనుక పార్టీ అంతర్గత రాజకీయ సమీకరణాలు ఉన్నాయా లేక స్వయంగా ఆయనే వ్యూహాత్మక విరామం తీసుకున్నారా అనే కోణంలోనూ రాజకీయ విశ్లేషకులు చర్చిస్తున్నారు. కొత్త పార్టీలో ఆశించిన గుర్తింపు, బాధ్యతల విషయంలో ఏవైనా పరిణామాలు చోటుచేసుకున్నాయా? లేదా వ్యక్తిగత కారణాల వల్ల ఆయన క్షేత్ర పర్యటనలకు సమయం కేటాయించలేకపోతున్నారా? అనే అంశాలపై కూడా చర్చ సాగుతోంది. ప్రజాజీవితంలో కొనసాగే నాయకులు అధికారం ఉన్నా లేకున్నా ప్రజల మధ్య నిలవాలని స్థానిక ప్రజలు, కార్యకర్తలు కోరుకుంటారు. ఈ నేపథ్యంలో, రెండు జిల్లాల్లో మళ్లీ పురాణం సతీష్ తన మునుపటి దూకుడును ఎప్పుడు ప్రదర్శిస్తారు? కేడర్‌కు ఎప్పుడు అందుబాటులోకి వస్తారు? అనే ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ అంశంపై మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ లేదా ఆయన ప్రతినిధుల స్పందన/వివరణ తెలియాల్సి ఉంది.

# భారమవుతున్న గణనాథుడు

### గల్లీకో మండపం.. ఇంటికో రసీదు పుస్తకం.. స్వచ్ఛంద విరాళం నుంచి బలవంతపు వసూళ్ల దాకా.
### ప్రజల సొమ్ముతో పండగలు.. కొందరికే ఆధిపత్య హోదాలు!
### నియంత్రణ కొరవడటంతో పండుగ స్ఫూర్తికే తూట్లు

మంచిర్యాల,: కష్టాలు, కడగండ్లు తీర్చే గణనాథుడి పండుగ వేళ సామాన్య పౌరుడి జేబుకు మాత్రం కొత్త విఘ్నాలు ఎదురవుతున్నాయి. స్వాతంత్ర్య పోరాట కాలంలో ప్రజలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు, ఐక్యతను చాటేందుకు లోకమాన్య తిలక్ ప్రారంభించిన గణేష్ ఉత్సవాలు. కాలక్రమేణా కొందరి చేతుల్లో ఆధిపత్య ప్రదర్శనకు,స్వార్థ రాజకీయ ఎదుగుదలకు సాధనాలుగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా బొగ్గుగని పరిసరాలు,పట్టణ కాలనీల్లో 'గల్లీకో వినాయకుడు.. ఇంటికో చందా' అన్న తీరుతో మధ్యతరగతి, కార్మిక కుటుంబాలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నాయి.

## రూపాయికి వెయ్యి పాట్లు.. చందాలకు లేవు రూల్స్!

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్యా, వైద్య ఖర్చులతో సతమతమవుతున్న సామాన్యుడికి ఈ సీజనల్ చందాలు పెనుభారంగా మారాయి. ఒకప్పుడు ఒక వార్డు లేదా ప్రాంతం మొత్తానికి ఒకటి, రెండు ఉత్సవ కమిటీలు ఉండేవి. కానీ నేడు అంతర్గత విభేదాలు, వ్యక్తిగత పరపతి చాటుకునే తాపత్రయంతో గల్లీకో మండపం వెలుస్తోంది. ఒకే సందులో మూడు నాలుగు కమిటీలు వెలిసి, ఒకే ఇంటి తలుపును పదే పదే తడుతూ రసీదు పుస్తకాలు తెరుస్తున్నాయి. "పక్కవాళ్లు వెయ్యి ఇచ్చారు.. మీరు ఇంతేనా?", "మా ఏరియాలో ఉంటూ మా కమిటీకి ఇవ్వరా?" అంటూ కొందరు నిర్వాహకులు చేస్తున్న వ్యాఖ్యలు మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చందా అనేది 'స్వచ్ఛందంగా' ఇవ్వాల్సిన విరాళం అనే విషయాన్ని విస్మరించి, ఒక అలిఖిత హక్కుగా డిమాండ్




చేయడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది.

## డబ్బులు ప్రజలవి.. పెత్తనం నిర్వాహకులదా?

సాధారణ ప్రజలు, చిరువ్యాపారుల నుంచి సేకరించిన సొమ్ముతోనే మండపాల ఏర్పాటు, విద్యుత్ దీపాలు, ఇతర ఖర్చులు సాగుతాయి. అయితే పండుగ నిర్వహణలో మాత్రం కొందరు మాత్రమే సర్వాధికారుల తరహాలో వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల కష్టార్జితంతో ఆడంబరాలు ప్రదర్శిస్తూ, పెద్ద పెద్ద ఫ్లెక్సీలలో తమ చిత్రపటాలను ప్రదర్శించుకోవడానికే కొందరు పరిమితమవుతున్నారనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఎంత వసూలైంది? ఎంత ఖర్చయింది? మిగిలిన సొమ్ము దేనికి వినియోగిస్తున్నారు? అన్న లెక్కలు ప్రజల ముందు ఉంచే పారదర్శకత చాలా చోట్ల కొరవడిందన్నది బహిరంగ రహస్యమే.

## ఆడంబరాల పోటాపోటీ.. సామాజిక బాధ్యత ఏదీ?

విగ్రహం ఎత్తు ఎంత? డీజే సౌండ్ ఏ స్థాయిలో ఉంది? లైటింగ్ హంగూ ఆర్భాటాలు ఎంత ఖరీదైనవి? అనే అంశాల్లోనే కమిటీలు పోటీ పడుతున్నాయి తప్ప.. ఆ నిధులను సేవా కార్యక్రమాలకు వినియోగించాలనే స్పృహ తగ్గుతోంది. రక్తదాన శిబిరాలు, పేద విద్యార్థులకు సాయం,అన్నదానం, మొక్కలు నాటడం వంటి సామాజిక కార్యక్రమాలకు పెద్దపీట వేసినప్పుడే గణేష్ నవరాత్రుల అసలైన పరమార్థం నెరవేరుతుంది. చట్టప్రకారం ఉత్సవాల నిర్వహణకు ఎవరైనా ప్రజలను బలవంతపెట్టి చందాలు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఎవరి స్థోమతకు తగినట్లు వారు సమర్పించే దాన్ని మాత్రమే స్వీకరించాలి. పరిమితికి మించి సౌండ్ బాక్సులు పెట్టడం, ప్రజలకు అసౌకర్యం కలిగించడం వంటి చర్యలపై అధికారులు ముందస్తు నిఘా ఉంచాలి. గణనాథుడి పండుగ ప్రజలకు ఆధ్యాత్మిక ఆనందాన్ని, మానసిక ప్రశాంతతను ఇవ్వాలి తప్ప.. వారి కుటుంబ బడ్జెట్‌కు, ఆత్మగౌరవానికి విఘాతంగా మారకూడదని విజ్ఞులు కోరుతున్నారు...

# తెలుగు నటి అయినా తంబీలు సొంత మనిషిలా!



టాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న యువ నటి శ్రీగౌరి ప్రియ తాజాగా తన సినీ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. భాషా బేధాలతో సంబంధం లేకుండా మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని నిరూపిస్తున్నారు. ముఖ్యంగా తమిళ చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న అనుభవాలు, విజయాల గురించి మీడియాతో ముచ్చటించారు. తెలుగు నేపథ్యం ఉన్నా? కోలీవుడ్‌లో అడుగుపెట్టి తక్కువ సమయంలోనే నటిగా మంచి గుర్తింపు తెచ్చుకోవడం పట్ల గౌరీ సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో గౌరీ ప్రియ నటించిన ప్రాజెక్టులు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విభిన్న కథాంశాలతో వస్తున్న చిత్రాలను ఎంచుకుని నటిగా తన పరిధిని విస్తరించు కుంటున్నట్లు తెలిపారు.సినిమా పరిశ్రమలో ఒక భాష నుంచి మరో భాషకు వెళ్లినప్పుడు మొదట్లో కొన్ని సవాళ్లు ఎదురుకావడం సహజమేనని శ్రీగౌరి ప్రియ పేర్కొన్నారు. అయితే తమిళ దర్శకులు, సాంకేతిక నిపుణులు అందిం చిన సహకారం వల్ల తమిళ భాషపై పట్టు సాధించగలిగానని వెల్లడించారు. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు లభించడమే తన విజయానికి అసలు రహస్యమని అభిప్రాయపడ్డారు.ా ప్రస్తుతం కోలీవుడ్‌లో వస్తున్న సరికొత్త ట్రెండ్స్ ..వైవిధ్యమైన కథల గురించి కూడా ప్రస్తావించారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా బలమైన భావోద్వేగాలు ఉన్న పాత్రల్లో నటించడానికే తాను ఎక్కువ ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రేక్షకుల నాడిని పట్టుకుని ముందుకు సాగడమే నటిగా ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలుగు అమ్మాయి అయినా? తమిళ ప్రేక్షకులు తనను సొంత మనిషిలా ఆదరిస్తున్నారని, ఆ ప్రేమ తనకెంతో సంతృప్తిని ఇస్తోందని శ్రీగౌరి ప్రియ ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. గౌరీ ప్రియ ప్రయత్నాలు కోలీవుడ్‌లో ఆమె స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తున్నాయి. ప్రస్తుతం అమ్మడు అక్కడ మూడు నాలుగు ప్రాజెక్ట్ లు కమిట్ అయినట్లు తెలుస్తోంది.

అలాగే ఇటీవలే రిలీజ్ అయిన తెలుగు సినిమా చెన్నైలవ్ స్టోరీతో బ్లాక్ బస్టర్ అందుకున్న సంగతి తెలిసిందే. ఇందులో అమ్మడి పాత్రకు మంచి పేరొచ్చింది. ఈ నేపథ్యంలో ఇక్కడా కొత్త అవకాశాలు తలుపు తడుతున్నాయి. ఇప్పటికే -వీసా- అనే మరో తెలుగు చిత్రంలోనూ నటిస్తున్నారు.

# గ్లామర్ డోస్ ఓవర్‌లోడ్.. రెడ్ డ్రెస్‌లో రుక్మిణి వసంత్ కిల్లింగ్ స్టిల్స్!

కన్నడ క్యూట్ బ్యూటీ రుక్మిణి వసంత్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన గ్లామరస్ ఫోటోలు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. చెన్నైలో జరిగిన ఒక ఈవెంట్‌లో పాల్గొన్న ఈ భామ, అక్కడ అభిమానుల నుంచి లభించిన అపారమైన ప్రేమకు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆ క్షణాలను గుర్తుచేసుకుంటూ 'డ్యాష్ అండ్ డాట్' బ్రాండ్‌కు చెందిన రెడ్ డ్రెస్‌లో దిగిన కిల్లర్ పిక్స్‌ను ఇన్స్టాగ్రామ్‌లో పంచుకోవడంతో నెటిజన్లు ఆమె అందానికి ఫిదా అవుతున్నారు.. చెన్నై ఈవెంట్‌లో ఎమోషనల్.. రెడ్ డ్రెస్‌లో రచ్చ: "చెన్నై.. నిన్నటి తీపి జ్ఞాపకాల నుంచి నేను ఇంకా బయటకు రాలేక పోతున్నాను. నిన్న స్టేజ్ పైకి వెళ్లినప్పుడు మీరు చూపించిన ప్రేమ నన్ను ఎంతగానో మురిపించింది. నిజంగా చాలా కృతజ్ఞురాలిని"

అంటూ రుక్మిణి ఒక ఎమోషనల్ నోట్ రాసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె ధరించిన 'క్రిమ్సన్ రెడ్ టై-అప్' హై-లో మ్యాక్సీ డ్రెస్, దాని బ్యాక్ కటౌట్ డిజైన్ ఆమె గ్లామర్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. 'సప్త సాగరదాచే ఎల్లో' నుంచి క్రేజీ ప్రాజెక్టుల వరకు: ఇక 2019లో 'బీర్బల్' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన రుక్మిణి వసంత్, 'సప్త సాగరదాచే ఎల్లో' పార్ట్-ఏ, పార్ట్-బీ సినిమాలతో భారీ పాపులారిటీ



సాధించారు. ఈ చిత్రానికి గానూ ఫిలింఫేర్ క్రిటిక్స్ బెస్ట్ నటి అవార్డును కూడా గెలుచుకున్నారు. ఆ తర్వాత 'బాణదారియల్లి', 'బఘీర', 'భైరతి రణగల్' వంటి చిత్రాలతో అలరించారు. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'తో తెలుగులోకి, 'ఏస్', 'మధరాసి' చిత్రాలతో తమిళంలోకి, అల్టిమేట్ హిట్ 'కాంతార: చాప్టర్ 1'తో పాన్ ఇండియా స్థాయిలో మెప్పించారు. బిజీ షెడ్యూల్.. ఎన్టీఆర్, యష్ సినిమాల్లో; ప్రస్తుతం రుక్మిణి వసంత్ టాలీవుడ్, శాండల్‌వుడ్ ఇండస్ట్రీలలో క్రేజీ ఆఫర్లతో దూసుకు పోతున్నారు. రాకింగ్ స్టార్ యష్ సరసన నటిస్తున్న భారీ చిత్రం 'టాక్సిక్' త్వరలోనే విడుదలకు సిద్ధమవు తుండగా, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూని యర్ ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో కూడా ఈమె కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతే కాకుండా 'ఫౌజీ51' చిత్రంతో మలయాళం లోకి కూడా అడుగు పెడు తున్నారు. కుర్రాళ్ల కలల రాణి: తన సహజమైన అభి నయంతో, క్యూట్ లుక్స్‌తో సౌత్ ఇండియాలో వరుస అవకాశాలు అందుకని స్టార్ హీరోయిన్‌గా మారుతున్నారు రుక్మిణి వసంత్. తాజాగా ఆమె పంచుకున్న ఈ రెడ్ డ్రెస్ కిల్లింగ్ స్టిల్స్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటూ, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచాయి..

# 20 లక్షలు దాటేసింది.. 'టాక్సిక్' బుకింగ్స్ మామూలుగా లేవుగా!




యష్ 'టాక్సిక్' థియేటర్లలోకి రావడానికి ఇక కొన్ని గంటలే ఉన్నాయి. 'కేజీఎఫ్ 2' తర్వాత నాలుగేళ్లకు పైగా గ్యాప్ తీసుకుని యష్ వస్తుండటంతో మొదటి రోజు ఓపెనింగ్స్ ఎలా ఉంటాయనే లెక్కలు ముందు నుంచే ఉన్నాయి. ఇప్పుడు రిలీజ్‌కు ముందు అడ్వాన్స్ బుకింగ్స్ చూస్తుంటే ఆ గ్యాప్ యష్ మార్కెట్‌ను పెద్దగా ఎఫెక్ట్ చేసినట్లు కనిపించడం లేదు. చివరి రోజు బుకింగ్స్ మరింత స్పీడ్ అందుకున్నాయి. 'టాక్సిక్' టీమ్ విడుదల చేసిన లేటెస్ట్ లెక్కల ప్రకారం బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ కలిపి ఇప్పటికే 20 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. అంతేకాదు బుక్‌మైషోలో ఒక్క గంటలోనే దాదాపు 50 వేల టికెట్లు బుక్ అయినట్లు మేకర్స్ చెబుతున్నారు. రిలీజ్‌కు ఒక్కరోజు ముందు ఇంత వేగంగా టికెట్లు కదలడం చూస్తుంటే బజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పవచ్చు. అయితే ఈ 20 లక్షల నెంబర్ మొత్తం అడ్వాన్స్ సేల్స్‌కు సంబంధించినదని టీమ్ ప్రకటించింది. ఇక డబ్బుల లెక్కలోనూ 'టాక్సిక్' పెద్ద నంబర్స్ వైపు వెళ్తోంది. మంగళవారం మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉన్న ట్రేడ్ లెక్కల ప్రకారం ఇండియాలో మొదటి రోజు అడ్వాన్స్ బుకింగ్ రూ.40 కోట్ల మార్క్ దాటింది. హిందీ వెర్షన్ నుంచే రూ.15 కోట్లకు పైగా రావడం ఇక్కడ మరో పెద్ద పాయింట్. కర్ణాటకతో పాటు నార్త్ మార్కెట్ కూడా యష్‌కు భారీగా ఓపెన్ అవుతోంది. నిజానికి 'టాక్సిక్'కు ఉన్న అసలు చాలెంజ్ కూడా ఇదే. 'కేజీఎఫ్ 2'తో యష్‌కు దేశవ్యాప్తంగా వచ్చిన మార్కెట్ ఒక్క సినిమా వరకేనా, లేక తర్వాత సినిమాకు కూడా అలాగే వస్తుందా అనే ప్రశ్న ఉంది. పైగా ఈసారి 'కేజీఎఫ్' బ్రాండ్ లేదు. ప్రశాంత్ నీల్ కూడా లేదు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో పూర్తిగా కొత్త కథతో వస్తున్నాడు. అయినా అడ్వాన్స్ బుకింగ్స్‌లో హిందీ మార్కెట్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే యష్ పేరు అక్కడ ఇంకా బలంగానే పని చేస్తోంది. మరోవైపు 'టాక్సిక్'కు 'ఏ' సర్టిఫికెట్ రావడం కూడా బుకింగ్స్‌ను పెద్దగా ఆపినట్లు లేదు. పెద్ద స్టార్ సినిమాలకు ఫ్యామిలీ ఆడియన్స్ చాలా కీలకం. కానీ ఈ సినిమా మొదటి నుంచే పెద్దల కోసం తీసిన కథగా ప్రమోట్ చేశారు. మూడు గంటలకు పైగా రన్‌టైమ్ ఉన్నా, కొన్ని నగరాల్లో టికెట్ ధరలు భారీగా ఉన్నా అడ్వాన్స్ సేల్స్ మాత్రం కొనసాగుతున్నాయి. ఇక నెక్స్ట్ యష్ ముందున్న టార్గెట్ అడ్వాన్స్ బుకింగ్స్ కాదు.. మొదటి రోజు ఉదయం నుంచి వచ్చే అసలు టాక్. మొదటి రోజు భారీ ఓపెనింగ్‌కు కావాల్సిన గ్రౌండ్ మాత్రం ఇప్పటికే రెడీ అయింది. 'కేజీఎఫ్' తర్వాత యష్ ఎలాంటి సినిమా ఎంచుకుంటాడనే నాలుగేళ్ల ఎదురుచూపులకు మరికొన్ని గంటల్లో సమాధానం రాబోతోంది. టాక్ కూడా బుకింగ్స్‌కు తోడైతే వీకెండ్ లెక్కలు ఎక్కడికి వెళ్తాయన్నదే నెక్స్ట్ పాయింట్.

# వెయ్యి కోట్ల నుంచి మహేష్ దిగుతాడా?



మహేష్ బాబు ప్రస్తుతం చేస్తున్న 'వారణాసి' ఆయన కెరీర్‌లోనే అతి పెద్ద సినిమా. రాజమౌళి దర్శకత్వం, ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ ప్లాన్, వెయ్యి కోట్లకు పైగా భారీ బడ్జెట్, ఐమాక్స్ స్కేల్.. ఇలా ప్రతి విషయంలోనూ ఈ సినిమా మరో స్థాయిలో ఉంది. 2027 ఏప్రిల్ 7 రిలీజ్‌కు సిద్ధమవుతున్న 'వారణాసి' కోసం దాదాపు 50 భాషల్లో డబ్బింగ్ ప్లాన్ చేస్తున్నారు. అంటే ఇది జస్ట్ పాన్ ఇండియా సినిమా కాదు, మహేష్‌ను గ్లోబల్ మార్కెట్‌లో పెట్టే ప్రాజెక్ట్‌గా రాజమౌళి తీసుకెళ్తున్నారు. ఇలాంటి సినిమా తర్వాత మహేష్ నెక్స్ట్ ఎవరితో చేస్తాడన్నది హాట్ టాపిక్ గా మారుతోంది. సందీప్ రెడ్డి వంగా, బుచ్చిబాబు పేర్లు గతంలో వినిపించాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో అనిల్ రావిపూడి పేరు గట్టిగా తిరుగుతోంది. 2028 సంక్రాంతికి సినిమా ప్లాన్ చేయొచ్చనే టాక్ కూడా ఉంది. అయితే ఇప్పటివరకు ఇది అధికారికంగా ఫిక్స్ కాలేదు. కానీ మహేష్ అనిల్ కాంబినేషన్ మళ్లీ వస్తే మాత్రం.. సినిమా ఎప్పుడు అన్నది కాదు.. ఏ రేంజ్‌లో చేస్తారు అన్నదే. 'వారణాసి' బడ్జెట్ రూ.1000 కోట్లకు పైగా ఉంటుందని అంచనాలు ఉన్నాయి. మహేష్ కూడా ఈ సినిమా తర్వాత దేశవ్యాప్తంగా కొత్త మార్కెట్‌లోకి వెళ్లే అవకాశం ఉంది. అలాంటి టైమ్‌లో మళ్లీ రూ.100 - 150 కోట్లలో రెగ్యులర్ కమర్షియల్ సినిమా చేయడానికి వస్తాడా? అనిల్ రావిపూడి ఇప్పటివరకు ఎక్కువగా సేఫ్ బడ్జెట్, కామెడీ, మాస్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌తోనే పెద్ద హిట్లు ఇచ్చాడు. రాజమౌళి స్థాయి కాన్వాస్‌లో సినిమా చేయాల్సిన అవసరం ఆయనకు ఇప్పటివరకు రాలేదు.అయితే మహేష్‌కు అనిల్ కొత్త దర్శకుడు కాదు. ఇద్దరూ 'సరిలేరు నీకెవ్వరు' చేశారు. ఆ సినిమా తర్వాత మహేష్ స్వయంగా అనిల్‌తో మళ్లీ సినిమా చేస్తానని చెప్పాడు. అనిల్ ఎనర్జీ, వేగంగా సినిమా పూర్తి చేసే విధానం తనకు బాగా నచ్చిందని అప్పట్లో ఇంటర్వ్యూలో చెప్పాడు. అంటే ఈ కాంబినేషన్‌కు పాత కమిట్‌మెంట్ కూడా ఉంది. ఇక్కడే అనిల్‌కు కూడా పెద్ద ఛాన్స్ ఉంటుంది. మహేష్‌ను 'వారణాసి' తర్వాత మళ్లీ పూర్తిగా లోకల్ కమర్షియల్ హీరోగా చూపిస్తే అది ఒక రకమైన సర్‌ప్రైజ్ అవుతుంది. లేక మహేష్ కొత్త మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని అనిల్ కూడా తన స్కేల్ పెంచుతాడా అన్నది చూడాలి. కామెడీ, మాస్ ఎంటర్‌టైన్‌మెంట్ వదలకుండా పెద్ద కాన్వాస్‌లో సినిమా చేయగలిగితే అది అనిల్ కెరీర్‌కే మరో జంప్ అవుతుంది. నిజానికి ప్రతి రాజమౌళి సినిమా తర్వాత హీరో తప్పనిసరిగా మరో వెయ్యి కోట్ల సినిమా చేయాల్సిన రూల్ లేదు. కానీ 'వారణాసి' తర్వాత మహేష్ మీద వచ్చే అంచనాలు మాత్రం తక్కువగా ఉండవు. అందుకే అనిల్ రావిపూడితో సినిమా నిజంగా ఫిక్స్ అయితే కథ కంటే ముందే బడ్జెట్, స్కేల్, మార్కెట్ గురించి ప్రశ్నలు మొదలవుతాయి. మరి వారి ప్లాన్ ఎలా ఉంటుందో తెలియాలి అంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

# మరింత ఫిట్‌గా కావ్య థాపర్... న్యూ లుక్ వైరల్!



తెలుగు చిత్రసీమలో తన అందం, అభినయంతో ఆకట్టుకున్న కథానాయిక కావ్య థాపర్ తాజాగా షేర్ చేసిన ఫోటోలు నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. కెరీర్ ప్రారంభంలో కాస్త బొద్దుగా కనిపించిన ఈ బ్యూటీ, ఇప్పుడు బరువు తగ్గి ఎంతో సన్నగా, ఫిట్‌గా మారిపోయింది. ఆమె కొత్త మేకోవర్ చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఎంతో కాన్ఫిడెంట్‌గా స్టైలిష్ డ్రెస్సుల్లో ఆమె దిగిన ఫోటోషూట్ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కావ్య థాపర్ గ్లామరస్ ఫోటోషూట్: తాజా ఫోటోషూట్‌లో కావ్య థాపర్ ఎంతో చిక్ అండ్ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తున్నారు. ప్రింటెడ్ బ్లూ మ్యాక్సీ డ్రెస్‌తో పాటు వేరొక పిక్‌లో ఫ్లోరల్ క్రాప్ టాప్, హై-స్లిట్ స్కర్ట్ ధరించి ఎంతో గ్లామరస్‌గా మెరిసిపోయారు. పర్ఫెక్ట్ ఫిట్‌నెస్‌తో పాటు గోల్డ్ బ్యాంగిల్స్, హై హీల్స్ జతచేసి ఇచ్చిన ఫ్యాషన్ పోజులు ఆమెలోని కొత్త ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని స్పష్టంగా చూపుతున్నాయి. ఈ న్యూ లుక్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. 'నేను రెడీ' ప్రమోషన్లలో సందడి: 2024లో వచ్చిన 'విశ్వం' సినిమా తర్వాత కావ్య థాపర్ నటించిన లేటెస్ట్ చిత్రం 'నేను రెడీ'. ఈ సినిమా ఆగస్టు 28న విడుదల కాబోతుండటంతో, ఆమె ప్రమోషన్ కార్యక్రమాల్లో జోరుగా పాల్గొంటున్నారు. ఈ ఈవెంట్లకు హాజరైన కావ్యను చూసిన ఫ్యాన్స్ ఒక్కసారిగా షాక్ అయ్యారు. గతంతో పోలిస్తే మరింత స్లిమ్‌గా, మునుపెన్నడూ లేనంత గ్లామరస్‌గా కనిపిస్తూ అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంటున్నారు. సినిమా అవకాశాలు, కెరీర్ గ్రాఫ్: తొలినాళ్లలోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కావ్య, తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ అవకాశాలు అందుకుంది. అయితే ఈ మధ్య కాలంలో ఆమెకు అవకాశాలు కాస్త తగ్గడంతో, తన ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి మేకోవర్ అయ్యారు. ఈ కొత్త అవతారంతో ఆమె మళ్లీ వరుస ప్రాజెక్టులతో బిజీ కావడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్లామర్ ప్రపంచంలో ఫిట్‌నెస్‌కు ఉన్న ప్రాధాన్యతను గుర్తిస్తూ కావ్య థాపర్ సాధించిన ఈ ట్రాన్స్‌ఫార్మేషన్ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది. రాబోయే 'నేను రెడీ' చిత్రం ఆమె కెరీర్‌కు మంచి మైలేజ్ ఇస్తుందని, ఈ కొత్త గ్లామరస్ లుక్ మరింతమంది దర్శకుల దృష్టిని ఆకర్షిస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కావ్య థాపర్ లేటెస్ట్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.



# మళ్లీ పాత పల్లవిలో నయా స్టార్!



టాలీవుడ్ కామెడీ కింగ్‌గా ఓ వెలుగు వెలిగిన అల్లరి నరేష్ తనదైన మేనరిజం, టైమింగ్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ ఎన్నో విజయాలను అందుకున్నారు. వరుస హాస్య చిత్రాలతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన కాలక్రమేణా ప్రేక్షకుల అభిరుచి మారుతున్న తరుణంలో తన జోనర్‌ను మార్చాలని నిర్ణయించుకున్నారు. కేవలం నవ్వులకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక చిత్రాలు చేయాలనే ఉద్దేశంతో సీరియస్ యాక్షన్ థ్రిల్లర్ బాట పట్టారు. ఈ క్రమంలోనే నరేష్ నటించిన -నాంది- మంచి విజయాన్ని సాధించడంతో నరేష్ ఇకపై సీరియస్ పాత్రలే చేస్తారని అందరూ భావించారు. అయితే ఆ తర్వాత వచ్చిన కొన్ని యాక్షన్ .. థ్రిల్లర్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. ప్రయోగాలు బాగానే ఉన్నా? నరేష్ నుంచి ప్రేక్షకులు కోరుకునే అసలు వినోదం మిస్సవుతోందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో .. అభిమానుల్లో గట్టిగా వినిపించింది. ఈ విషయాన్ని గ్రహించిన అల్లరి నరేష్ పంథాను మార్చుకుని మళ్లీ తనకు కలిసొచ్చిన కామెడీ జోనర్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నారు. ప్రేక్షకులకు బోరు కొట్టించిన పాత ధోరణికి భిన్నంగా సరికొత్త ఫన్ .. ఎంటర్‌టైనర్ కథలతో ముందుకొస్తున్నారు. ఇందులో భాగంగానే నరేష్ నటిస్తోన్న తాజా చిత్రంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం నరేష్ చేతిలో -రంభా ఊర్వశి మేనక- వంటి ఫాంటసీ టచ్ ఉన్న పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం ఉంది. చంద్రమోహన్ చింతా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్ ఇప్పటికే ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనుకోని పరిస్థితుల్లో భూమి మీదకి వచ్చిన దేవకన్యల వల్ల హీరో పడే ఇబ్బపాల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. అలాగే -సభకు నమస్కారం-, -కనక దుర్గ- వంటి వినోదాత్మక చిత్రాల్లోనూ నటిస్తున్నారు. నరేష్ ఒక్కసారిగా సీరియస్ రూట్ నుంచి మళ్లీ తన మార్క్ కామెడీ బాటలోకి రావడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నరేష్ మళ్ళీ పాత కామెడీ పల్లవిని అందుకుంటే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగని యాక్షన్ థ్రిల్లర్లు నరేష్ కు సెట్ అవ్వలేదు అని కాదు. యాక్షన్ పాత్రల్లో సైతం తనదైన ముద్ర వేసారు. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే కథలు రొటీన్ గా ఉండటంతో అవి ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వలేదు. -మహర్షి-లో రైతు కొడుకు పాత్రతో నరేష్ ఎంతగానో ఆకట్టుకున్నారు. ఆ పాత్రతో నరేష్ సెకెండ్ ఇన్నింగ్స్ పూర్తిగా మారిపోతుందనుకున్నారు. కానీ ఆ తర్వాత ఎంచుకున్న కథలు కనెక్ట్ కాకపోవడంతో రేసులో వెనుకబడ్డారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815